సాక్షి వికారాబాద్

శనివారం ¦ 19 ¦ జూలై ¦ 2025



దుద్యాల్: బోనంతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



తాండూరు టౌన్: శాకాంబరి మాత అలంకరణలో రేణుకా నాగ ఎల్లమ్మ



విద్యార్థులే దేశ పునాదులు

నేటి విద్యార్థులే దేశ భవిష్యత్‌కు బలమైన పునాదులని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

8లో▸



రోడ్లు ధ్వంసం

కేజ్‌వీల్స్ ట్రాక్టర్ల కారణంగా గ్రామీణ ప్రాంత రోడ్లు దెబ్బతింటున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది.

9లో▸



బొంరాస్‌పేట: బోనాల ఊరేగింపు

బోనం.. వైభవం

ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఎల్లమ్మ, పోచమ్మ, మైసమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజు విన్యాశాలు ఆకట్టుకున్నాయి.

– తాండూరు టౌన్/బొంరాస్‌పేట/దుద్యాల్

న్యూస్‌రీల్

శివుని మహిమలు అనిర్వచనీయం

జైపూర్ పండితులు మదన్ మోహన్ జీ



తాండూరు టౌన్: శివుని మహిమలు అనిర్వచనీయమని జైపూర్ పండితులు మదన్ మోహన్‌జీ అన్నారు. రానున్న శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని తాండూరులోని రాజస్థానీ మహిళా మండలి ఆధ్వర్యంలో స్థానిక గగరాణి ఫంక్షన్ హాల్‌లో శివ మహా పురాణం ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా మదన్‌మోహన్ జీ మాట్లాడుతూ.. మహిమాన్వితుడైన శివుని మహోన్నతమైన మహిమలు కథల రూపంలో ఆలకించాలన్నారు. శ్రావణమాసం శివునికి అత్యంత ప్రీతి పాత్రమైందని, ఈ మాసంలో శివుని ఆరాధన నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో రాజస్థానీ మహిళా మండలి అధ్యక్షురాలు కిరణ్ సార్డా, కార్యదర్శి వర్షా సార్డా, కోశాధికారి కల్పన రాఠి, ఆర్థిక సహాయకులు రాంబగస్ బంకట్‌లాల్ సోని, మురళీధర్ గగరాణి, రాజేష్ సోని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు తాండూరుకు ఎంపీ కొండా రాక

తాండూరు టౌన్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా స్థాయి కార్యశాల కార్యక్రమాన్ని నేడు తాండూరులో నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విశిష్ట అతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, జిల్లా ప్రభారి జె శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, స్థానిక ఎన్నికల జిల్లా కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా తదితరులు హాజరవుతారన్నారు. పార్టీ జిల్లా, మండలాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

బకాయి వేతనాలు ఇవ్వాలని వినతి



కడా ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధిహామీ పథకం ఉద్యోగులు

కొడంగల్ రూరల్: నాలుగు నెలలు గడుస్తున్నా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే మంజూరు చేయాలని బొంరాస్‌పేట మండల ఉపాధి హామీ ఉద్యోగులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు రాక పిల్లల ఫీజులు కూడా కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు.

నేడు శంకర్‌పల్లికి కేంద్ర రైల్వే మంత్రి రాక

శంకర్‌పల్లి: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం ఉదయం 10.30 గంటలకు శంకర్‌పల్లికి రానున్నారు. సంగారెడ్డి జిల్లాలోని ఐఐటీ హైదరాబాద్‌లో జరిగే ఓ కార్యక్రమం అనంతరం శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌కి వచ్చి ప్రత్యేక రైలులో కాజీపేటకు వెళ్లనున్నట్లు రైల్వే అధికారులు, పోలీసులు తెలిపారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం దక్షిణ మధ్య డివిజినల్ రైల్వే మేనేజర్ బీకే జైన్ శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

‘సీజనల్’పై సమాయత్తం

ముందస్తు చర్యలతో వ్యాధుల కట్టడి

- జిల్లాలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది
- ఫీవర్ సర్వే చేయిస్తున్నాం
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టిక ఉండాల్సిందే
- ‘సాక్షి’తో జిల్లా వైద్యాధికారి లలితాదేవి



లలితాదేవి, డీఎంహెచ్‌ఓ

వికారాబాద్: ‘ముందస్తు చర్యలే నివారణ మార్గం.. వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. లేకుంటే సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వైద్య ఆరోగ్య శాఖ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. ప్రజలు సహకరిస్తే వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం’ అని డీఎంహెచ్‌ఓ లలితాదేవి అన్నారు. సీజనల్ వ్యాధులు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వహణ, సిజేరియన్ ఆపరేషన్ల నియంత్రణకు శాఖా పరంగా తీసుకుంటున్న చర్యలను ‘సాక్షి’కి వివరించారు. ఆమె మాటల్లోనే..

17 డెంగీ కేసులు నమోదు

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే చేయిస్తున్నారం. అక్కడక్కడ జ్వరం కేసులు నమోదవుతున్నాయి. ఇవి కూడా సాధారణ జ్వరాలే. గతంతో పోలిస్తే విష, వైరల్ ఫీవర్ కేసులు చాలా తక్కువే. ప్రస్తుతం జిల్లాలో 17 డెంగీ కేసులు ఉన్నా నియంత్రణలోనే ఉన్నాయి.. అప్రమత్తంగా ఉంటే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. పీహెచ్‌సీల్లో, బస్తీ దవాఖానాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తున్నాం

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వసతి గృహాల్లో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నట్లు సమాచారం రావడంతో ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ వైద్యులు విజిట్ చేయాలని ఆదేశించాం. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించాం. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజలను కోరాం. వీటితో పాటు రోజువారి కార్యక్రమాలు వ్యాధి నిరోధక టీకాలు, ప్రసవాలు, రక్త పరీక్షల నిర్వహణ తదితర సేవలు యథావిధిగా సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ సమస్యలను అధిగమించగలమని భావిస్తున్నాం.

రాష్ట్రంలో మూడో స్థానంలో..

జిల్లాలో 24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 134 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో ఏడు 24 గంటల పీహెచ్‌సీలు ఉన్నాయి. అన్ని ఏరియా, జిల్లా ఆస్పత్రులతో పాటు కొన్ని పీహెచ్‌సీలలో కాన్పులు చేస్తున్నాం. డెలివరీల్లో జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది. హైరిస్క్ కేసులను జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నాం. ప్రైవేటు హాస్పిటల్స్‌లో 60 శాతం సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతుండగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 45 శాతం అవుతున్నాయి. వీటి సంఖ్య మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వారి పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటాం. వైద్యుడి సూచనలు లేకుండా మందులు విక్రయించరాదు.

అబార్షన్లు చేస్తే చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తే ఉపేక్షించం. ఒకవేళ అబార్షన్ చేయాల్సి వస్తే గర్భం దాల్చిన 24 వారాల లోపు డీఎంహెచ్‌ఓ అనుమతి తీసుకోవా లి.ఆ తర్వాత చేయాల్సి వస్తే మెడికల్ బోర్డు అనుమతి తప్పని సరి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలకు సంబంధించి ధరల పట్టిక కచ్చితంగా ఉండాలి. ప్రైవేట్ ల్యాబుల్లో అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇక్కడ 150 రకాల టెస్టులు చేస్తారు.ఇవన్నీ ఉచితంగానే. ప్రజలు టెస్టుల కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన పనిలేదు. వారికి అందుబాటులో ఉన్న పీహెచ్‌సీల్లో రక్త న మూనాలు ఇస్తే ఫోన్ ద్వారా సమాచారం తెలియజేస్తాం. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



చెక్కు అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

మహిళా సాధికారతే లక్ష్యం

- స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి

కొడంగల్: నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘాలకు రూ.8 కోట్ల 58 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసినట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడా కార్యాలయంలో సంఘం సభ్యులకు చెక్కులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తోందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఉచిత కరెంటు, రూ.500లకు గ్యాస్ సిలిండర్ తదితర పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి మహిళలను అన్ని రంగాల్లోనూ ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మహిళా సంఘాల ఇన్‌చార్జ్ నరసింహ్మా, ఏపీఓ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణంరాజు, నయీమ్, ఓం ప్రకాశ్, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు

నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కడా కార్యాలయంలో మండలంలోని లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. కొడంగల్, దుద్యాల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాలకు 2,579 కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు చెప్పారు.



కొత్తపల్లి పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వెంకటరత్నం, ఉపాధ్యాయులు

పారదర్శకత పాటించాలి

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం

బంట్వారం: ఉపాధ్యాయుల సర్దుబాటులో పారదర్శకత పాటించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటరత్నం అన్నారు. కోట్‌పల్లి మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్ యూటీఎఫ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గిస్తూ.. మరోవైపు విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఒత్తిడి తేవడం సరైంది కాదన్నారు. జిల్లాలోని కొంతమంది స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓలు కొన్ని పోస్టులను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రాంచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, గోపాల్, నరేష్, యాదవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దుతాం

- కాంగ్రెస్ వచ్చాక ప్రతి పేదవాడికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి/తాండూరు: పల్లెలను పట్టణాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పరిగి మండలంలోని సయ్యాద్ మల్కాపూర్, రాఘవాపూర్, జాఫర్‌పల్లి, చిట్యాల, రాపోల్, సయ్యాద్‌పల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. తాము అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేసి నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, నాయకులు చిన్న నర్సింహులు, ఆంజనేయులు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



జాఫర్‌పల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు



మహిళలకు చెక్కు ఇస్తున్న మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రుణాల చెల్లింపులో ఆదర్శం

మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బ్యాంక్ లింకేజీ రుణాల చెల్లింపులో మహిళా సంఘాల సభ్యులు ఆదర్శంగా నిలుస్తున్నారని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను, ఫుడ్ మేళాను అధికారులతో కలిసి నేతలు పరిశీలించారు. మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను చూసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సమాజంలో మహిళా శక్తి ఎంతో కీలకమన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే కుటుంబాలు, రాష్ట్రం పురోగతి సాధిస్తుందన్నారు. గత ప్రభుత్వం మహిళలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని అన్నారు. అన్ని పథకాలను మహిళల పేరిటే ఇస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ విక్రంసింహారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు రండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ధర్మకర్తలు



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ధర్మకర్తలు

కొడంగల్: పట్టణంలోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం నుంచి నిర్వహించే పవిత్రోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, నందారం మధు, ఆలయ ఈఓ రాజేందర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. మూడు రోజుల పాటు వైభవంగా పూజలు జరుగుతాయని తెలిపారు. తిరుమల తిరుపతి తరహాలోనే వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని చెప్పారు. 20వ తేదీ ఉదయం 9గంటలకు ఉత్సవ మూర్తులకు శతకళశ తిరుమంజనం, మధ్యాహ్నం 12గంటలకు అగ్ని ప్రతిష్ఠ, విశేష హోమాలు, పవిత్ర ప్రతిష్ఠ, రాత్రి 7గంటలకు కుంభావాహన, విశేష హోమాలు, 21వ తేదీ ఉదయం 9గంటలకు విశేష ఉక్త హోమాలు, పవిత్ర సమర్పణ, రాత్రి 8గంటలకు విశేష హోమాలు, 22వ తేదీ ఉదయం 9గంటలకు విశేష హోమాలతో పాటు పవిత్రోత్సవం, అష్టోత్ర శత అష్టదళ పద్మారాధన, పవిత్రోత్సవ మహా పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు కుంభ బింబ ప్రదక్షిణము, ప్రోక్షణ కార్యక్రమాలు ఉంటాయని ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. శ్రీవారిని దర్శించుకోడానికి తాను వస్తానని ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

జీఓ 317ను రద్దు చేయాలి



ఉపాధ్యాయులకు సభ్యత్వం ఇస్తున్న లక్ష్మీకాంతరావు

తపస్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంతరావు

బషీరాబాద్: ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన 317 జీఓను వెంటనే రద్దు చేయాలని తపస్ రాష్ట్ర కోశాధికారి కరణం లక్ష్మీంకాంతరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గతంలో నేటి సీఎం రేవంత్‌రెడ్డి 317 జీవోను తప్పుబట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటున్న ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించాలన్నారు. అలాగే డీఏ బకాయిలను నెలనెలా చెల్లించాలని కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందిచడానికి పోరాడుతుందని, దీనికి ఉపాధ్యాయులు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాజుల వీరేశం, కవిత, కే శోభ, జిల్లా బాధ్యులు చంద్రశేఖర్ గౌడ్, పట్లోళ్ల అనిల్, రవి గౌడ్ దూస శ్రీనివాస్, అనిల్ కుమార్, కే శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


తిరుపతిరెడ్డి (ఫైల్)

దుద్యాల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ యాదగిరి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని అల్లిఖాన్‌పల్లికి చెందిన కుక్కలి తిరుపతిరెడ్డి(42), పద్మ దంపతులు. జూన్ 11న ఉదయం 8గంటల ప్రాంతంలో మహబూబ్‌నగర్ వెళ్లి వస్తానని భార్యకు చెప్పి వెళ్లిన తిరుపతిరెడ్డి తిరిగి రాలేదు. గతంలోనూ కొన్ని రోజులు చుట్టాల గ్రామాలకు వెళ్లి తిరిగి వచ్చేవాడని అదే మాదిరిగా వస్తాడని భార్య భావించింది. 37 రోజులు గడిచినా ఎంతకూ ఇంటికి రాకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందిన పద్మ శుక్రవారం దుద్యాల్ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు దుద్యాల్ పోలీసులను గానీ, భార్య పద్మ(9666819238)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- అరకిలో పట్టివేత
- ముగ్గురు బిహారీ కూలీలకు రిమాండ్


పోలీసుల అదుపులో నిందితులు

తాండూరు టౌన్: ఓ క్రషింగ్ మిషన్ యూనిట్‌లో కూలీలుగా పనిచేస్తున్న ముగ్గురు బిహారీల వద్ద తాండూరు ఎక్సైజ్ పోలీసులు అరకిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని జనతా స్టోన్ ఫ్యాక్టరీ, కేటీసీ స్టోన్ ఇండస్ట్రీ పరిసర ప్రాంతాల్లోని నాపరాయి పాలిషింగ్ మిషన్లలో బీహార్‌కు చెందిన ముక్తార్, నిజాం, సద్దాం కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు బీహార్ నుంచి గంజాయిని తీసుకువచ్చి తాండూరులో విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకుని దాడి చేశారు. దీంతో వారి వద్ద అరకిలో ఎండు గంజాయి పట్టుపడింది. గంజాయిని సీజ్ చేసిన పోలీసులు, ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నిజాముద్దీన్, రవికుమార్, సిబ్బంది భీమయ్య, రవికిషోర్, రమేశ్, మహేశ్, సతీశ్, కృష్ణ, ఆసిఫాబేగం పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో 1.10ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన విషయంలో మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పలువురు నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. 1947లో దేశ విభజన సమయంలో కాందిశీకులు వదిలి వెళ్లిన సుమారు ఏడెకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మున్సిపల్ భూమిగా పరిగణించి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ అవసరాలకు కేటాయించింది. ఇట్టి భూమి పరిధిలోని 1.10 ఎకరాల భూమిని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కబ్జాకు యత్నిస్తున్నారని. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కాపాడాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు ప్యాట శంకర్, శివరాజు, మోహన్‌రెడ్డి, రాఘువేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేయాలి

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

యాలాల: మండల పరిధిలోని జుంటుపల్లికి చెందిన వెంకటరాంరెడ్డి దళితులపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని, ఆ వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జుంటుపల్లికి చెందిన శ్రావణ్‌రెడ్డి పొలంలో నెత్తి వెంకటయ్య నారుగుంటిని ట్రాక్టర్ రోటివేటర్‌తో దున్నాడు. ఈ విషయమై వెంకటరాంరెడ్డి వెంకటయ్యను కులం పేరుతో దూషించాడు. బాధిత వ్యక్తి దళిత సంఘాల ఆధ్వర్యంలో యాలాల పీఎస్‌లో వెంకటరాంరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించారు. ఇది మనసులో పెట్టుకున్న ఆయన ప్రతీరోజు దళితులను తిడుతూ.. కారుతో గుద్ది చంపుతానని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు స్పందించి బెదిరింపులకు గురి చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఫకీరప్ప, నర్సింలు, అంజిలప్ప, హన్మంత్, లక్ష్మప్ప, ఆనందం, రాములు, శంకర్, రాజు, మొగులప్ప తదితరులు ఉన్నారు.

బోనాల సంబురం


దుద్యాల్: బోనాల ఊరేగింపు

జిల్లా వ్యాప్తంగా ఆషాఢ బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆయా గ్రామాల్లో మహిళలు నెత్తిన బోనమెత్తి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల ఊరేగింపుసందర్భంగా శివసత్తుల శిగాలు, పోతరాజులు, యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా ఉత్సవాల్లో పలువురు నేతలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

– వికారాబాద్ నెట్‌వర్క్


ధారూరు: పోచమ్మకు బోనమెత్తిన మహిళలు


దుద్యాల్: భవానీ మాత ఆలయం వద్ద భక్తుల సందడి


కుల్కచర్ల: పోచమ్మ తల్లి బోనాల ఊరేగింపు


కొడంగల్ రూరల్: అప్పాయిపల్లిలో పోచమ్మ తల్లికి పూజలు

బస్సు సర్వీసులు పెంచాలి


ధారూరు: తరిగోపుల చౌరస్తా రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు


బంట్వారం: రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

- తరిగోపుల చౌరస్తాలో విద్యార్థులు, గ్రామస్తుల ధర్నా

ధారూరు: అదనపు బస్సు సర్వీసులు వేయాలని మండల పరిధిలోని తరిగోపుల గ్రామస్తులు, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు గురువారం గ్రామంలోని చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. దాదాపు వంద మంది విద్యార్థులు వికారాబాద్‌కు రోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లివస్తుంటారని, ఉదయం, సాయంత్రం ఒకే ట్రిప్పు నడిపించడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని యువకులు, తల్లిదండ్రులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. వికారాబాద్ నుంచి తరిగోపుల గ్రామానికి వచ్చిన బస్సును తిరిగి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఉదయం 7:30 గంటలకు, 8:30 గంటలకు ఒకసారి, సాయంత్రం 5 గంటలకు, 5:30 గంటలకు రెండు ట్రిప్పుల చొప్పున నడపాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల సౌకర్యార్థం ఉదయం 11 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు ఒక సర్వీసు నడపాలని కోరారు. ఇటీవల మేకలగండి రోడ్డులో బస్సు అదుపుతప్పి తృటిలో ప్రమాదం తప్పిందని గుర్తు చేశారు. 40 మంది కూర్చోవాల్సిన బస్సులో వంద మందికి పైగా ఎక్కువతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సుల ట్రిప్పుల సంఖ్య పెంచి ఇబ్బందులు తీర్చాలని కోరారు. విషయం తెలుసుకున్న ధారూరు పోలీసులు గ్రామానికి చేరుకుని యువతకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన వినలేరు. మొండికేసిన యువకులను బలవంతంగా అదే బస్సులో ఎక్కించారు. గ్రామస్తులకు, తల్లిదండ్రులకు నచ్చజెప్పి, డిపో మేనేజర్‌తో మాట్లాడించి ధర్నాను విరమింపజేశారు.

సమయపాలన పాటించాలి

బంట్వారం: కళాశాల సమయానికి ఆర్టీసీ బస్సు నడపాలని కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ విద్యార్థులు శుక్రవారం ఉదయం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ వికారాబాద్ నుంచి బార్వాద్ బస్సు ఉదయం 7:30కు రావాల్సి ఉంటుందన్నారు. కొన్ని రోజులుగా సమయానికి రాకపోవడంతో కళాశాలకు వెళ్లడం ఆలస్యమవుతుందన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి బార్వాద్ బస్సును సమయానికి నడిపించాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి విద్యార్థులకు మద్దతు తెలిపి ధర్నాలో కూర్చున్నారు. ఈ విషయంపై వికారాబాద్ డీఎం వెంటనే స్పందించారు. విద్యార్థులతో ఫోన్లో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. రోడ్డు బాగోలేకపోవడంతో రెండు రోజులుగా కొంత ఆలస్యమైందన్నారు. సమయానికి నడిపించేలా చర్యలు చేపడుతామన్నారు.

విద్యార్థులే దేశ పునాదులు


తాండూరు రూరల్: మోడల్ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ


బంట్వారం: కోట్‌పల్లి కేజీబీవీలో కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

- ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: నేటి మన విద్యార్థులే దేశ పునాదులు అని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న మాడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను ప్రశంసించారు. తదనంతరం పలు గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. వర్షాకాలం సందర్భంగా ఆయా గ్రామాల్లో మొక్కలు నాటాలని ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులను సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ తప్పనిసరి

బంట్వారం: హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని కోట్‌పల్లి తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ డానియల్‌తో కలిసి కోట్‌పల్లి కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వంటగదితో పాటు కూరగాయలను పరిశీలించారు. సరుకుల నాణ్యతను చెక్ చేశారు. వంటకాలు రుచిగా ఉంటున్నాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. ఎస్ఓ పల్లవిరెడ్డికి పలు సూచనలు ఇచ్చారు.

అర్హులందరికీ ఆర్థికసాయం

- మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణి

యాలాల: ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కొత్త ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల విచారణను శుక్రవారం చేపట్టారు. గోవిందరావుపేట విచారణ అధికారిగా వ్యవహరిస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణి, పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబాతో కలిసి వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగయ్య, నర్సింలు, చందు, ఉమేశ్, రాజు, లాలు, లక్ష్మప్ప, బుడ్డప్ప తదితరులు ఉన్నారు.


లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న ఏఓ తదితరులు

వికారాబాద్‌లో భారీ వర్షం


మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

అనంతగిరి: వికారాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం వ్యవసాయానికి ఎంతో దోహదం కానుంది. వర్షంతో వికారాబాద్ పట్టణంలోని పలు రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.

మోమిన్‌పేటలో మోస్తరు వర్షం

మోమిన్‌పేట: మండల పరిధిలో శుక్రవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. మధ్యాహ్నం గంట పాటు వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.20 రోజులుగా వరుణుడు మొఖం చాటేయడంతో పంటలుఎండుముఖం పట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్షంతో పంటలకు జీవం పోసినట్లయిందని తెలిపారు.

మేకల మందపై దాడి చేసింది చిరుతలు కాదు

షాబాద్‌షరీఫ్: బాలాపూర్ మండలం మల్లాపూర్‌లో మేకలమందపై దాడి చేసింది చిరుతలు కాదని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.రాజేందర్ రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం రాత్రి మల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు బాబుకు సంబంధించిన 16 మేకలు గొంతు కొరకబడి మృతి చెందాయి. ఇటీవల ఆర్సీఐలో చిరుతల సంచారం అంటూ వదంతులు రావడం.. ఈ క్రమంలో సమీపంలోని గ్రామంలో మేకలు చంపబడడంతో చిరుతలు చంపి ఉంటాయని స్థానిక ప్రజల్లో ఆందోళన మొదలయింది. విషయం తెలుసుకున్న బాలాపూర్ పోలీసులు ఫారెస్ట్ అధికారులను పిలిపించి స్థానికంగా అడుగు జాడలతో పాటు సీసీ కెమెరాలను పరిశీలించారు. చిరుతలు, ఇతర క్రూర మృగాలకు సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. వీధికుక్కలు దాడి చేసి చంపినట్లుగా తెలుస్తోందన్నారు. ఈ విషయంలో ప్రజలెవరూ ఆందోళన చెందొద్దని.. ఏదైనా సమాచారం ఉంటే సోషల్ మీడియాలో కాకుండా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా వదంతులు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

క్షయపై అప్రమత్తత అవసరం


బంట్వారం: మాట్లాడుతున్న డాక్టర్ మేఘన


దౌల్తాబాద్: శిబిరంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

- మెడికల్ ఆఫీసర్ మేఘన
- మోత్కుపల్లిలో అవగాహన సదస్సు

బంట్వారం: క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరమని కోట్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మేఘన అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోట్‌పల్లి మండలం మోత్కుపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు పలువురిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశామన్నారు. వ్యాధికి గురైనట్లు నిర్ధారిస్తే ఆరు నెలలపాటు ఉచితంగా మందులతోపాటు నెలకు రూ.వేయి అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఖయూం, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎస్ఎం నర్సమ్మ, టీబీ యూనిట్ రాజేందర్, అశోక్, ఎల్టీ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

టీబీని నిర్మూలిద్దాం

దౌల్తాబాద్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య సూచించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం కుదురుమళ్లలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అమూల్య మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఉన్న వారికి జ్వరం, దగ్గు, నీరసం బరువు తగ్గడం లక్షణాలు ఉంటాయన్నారు. ఈ శిబిరంలో 210 మందికి పరీక్షలు చేయగా 12 మందిని అనుమానితులుగా గుర్తించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ భీమ్‌శంకర్, మాధవి, రాహత్ ఏఎస్ఎం పుష్పలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో 35 మంది ఎస్సైల బదిలీ

- ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
- తక్షణమే అమల్లోకి

బషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 35 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డీఐజీ ఇక్బాల్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు.

బదిలీల వివివరాలు ఇలా..

ఎస్ఐ పేరు	పనిచేస్తున్న పీఎస్	బదిలీ అయిన పీఎస్
కే గోపాల్	కొడంగల్	ధారూరు ఎస్ఐ -2
ఎం స్వామిదాసు	వెయిటింగ్	సీసీఎస్ వికారాబాద్
ఎంఏ సాజిద్	వెయిటింగ్	కరణ్‌కోట్ ఎస్ఐ -2
వై యాద్గిర్	వెయిటింగ్	డీడీటీ అటాచ్, దుద్యాల్
వి.శ్రీశైలం యాదవ్	వికారాబాద్	వీఆర్ వికారాబాద్
జీ ఆనంద్ కుమార్	దోమ	పీసీఆర్ వికారాబాద్
కడల వేణుకుమార్	వెయిటింగ్	పెద్దేముల్
సున్నం రాఘవేందర్	వెయింట్	ధారూరు
రమావత్ శ్వేత	వెయిటింగ్	డీఎస్‌బీ,వికారాబాద్(ఉమెన్ పీఎస్)
జి.పృథ్వీక్	వెయిటింగ్	నవాబుపేట
కే.విఠల్	వెయిటింగ్	యాలాల
పోగుల శ్రీశైలం	వెయిటింగ్	దోమ
మర్పల్లి ప్రవీణ్‌కుమార్	వెయిటింగ్	వికారాబాద్ ఎస్ఐ -2
బంగారు రాజ్‌కుమార్	వెయిటింగ్	దౌల్తాబాద్
గాడోళ్ల పుష్పలత	వెయిటింగ్	కరణ్‌కోట్
వాదిత్య వసంత్‌జాదవ్	వెయిటింగ్	తాండూరు టౌన్ ఎస్ఐ -2
బర్దిపూర్ మోహన్‌కృష్ణ	వెయిటింగ్	పరిగి
మర్పల్లి మీనాక్షి	వెయిటింగ్	కొడంగల్
రాథోడ్ వినోద్	వెయిటింగ్	తాండూరు టౌన్
ఎండీ నుమన్ అలీ	వెయిటింగ్	బషీరాబాద్
శ్వేత	వెయిటింగ్	డీఎస్‌బీ భరోసా కేంద్రం
డి.అనిత	ధారూరు	మహిళా పీఎస్, వికారాబాద్
ఎండీ అబ్దుల్ రవూఫ్	బొంరాస్‌పేట	మర్పల్లి
కే.అరుణ్‌కుమార్	నవాబుపేట	వీఆర్, వికారాబాద్
ఎం సంతోష్‌కుమార్	పరిగి	వీఆర్, వికారాబాద్
ఏ.రవి	దౌల్తాబాద్	సీసీఎస్, వికారాబాద్
పి.విఠల్‌రెడ్డి	కరణ్‌కోట్	సీసీఎస్, వికారాబాద్
కే.గిరెన్న	యాలాల	ఎస్ఐ -1 వికారాబాద్
పి.శంకర్	బషీరాబాద్	సీసీఎ.స్ వికారాబాద్
ఎం ప్రశాంత్‌వర్ధన్	పెద్దేముల్	కొడంగల్ ఎస్ఐ -2
బాల వెంటకరమణ	వీఆర్	బొంరాస్‌పేట
నాగేందర్	వీఆర్	పరిగి ఎస్ఐ-2
మూడ్ అంబారియా	వీఆర్	తాండూరు టౌన్
శ్రీనివాస్	వీఆర్	బషీరాబాద్ ఎస్ఐ -2
సత్యనారాయణరాజు	వికారాబాద్	యాలాల ఎస్ఐ -2